www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 29 సెప్టెంబర్ 2025 5 కాకినాడ

30న కాకినాడ ప్రగతిపై పౌర సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగర ప్రగతికి ఎదురవుతున్న పెను సవాళ్లు-అధిగమించాల్సిన ఆవశ్యకత అంశంపై మంగళవారం ఉదయం 11 గంటలకు జెఎన్‌టియు ప్రక్కన ఉన్న మేవా ఫంక్షన్ హాల్లో పౌర సమీక్ష సమావేశం నిర్వహిస్తామనిపౌర సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణ రాజు తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రజా సంఘాల నాయకులు మేధావులు, మాజీ ప్రజా ప్రతినిధులు తెలిపే సలహాలు, సూచనలు ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్‌కు పౌర లేఖ ద్వారా తెలియజేస్తామన్నారు. పౌర ప్రముఖులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. హాజరు కాలేనివారు 9948146999 నెంబరుకు వాట్సాప్‌నకు సూచనలు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

లంకలను తాకిన వరద

- కాటన్ బ్యారేజీ వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- సముద్రంలోకి 10.14 లక్షల క్యూసెక్కుల విడుదల
- పలుచోట్ల నీట మునిగిన కాజ్‌వేలు

నీటమునిగిన అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం స్నానఘట్టం

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి వరద లంకలను తాకింది. రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి వరద ఆదివారం ఉదయం నాటికి తగ్గి మళ్లీ పెరిగింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 43.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన కొన్ని గంటల్లోనే మళ్లీ ప్రవాహం పెరగింది. దీంతో మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద కూడా వరద స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12.10 అడుగుల నీటి మట్టం ఉంది. ఇక్కడ ఇంకా మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లకు పైకి లేపి 10,14,656 క్యూసెక్కుల నీటికి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం తూరు. పశ్చిమ, సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువలకు 10,300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

లంకలను తాకిన వరద నీరు

వరద తగ్గుముఖం పట్టినప్పటికీ లంకలను తాకుతూనే ప్రవామం ఉంది. కాటన్ బ్యారేజీ నుంచి 10లక్షల క్యూసెక్కులకు పైగా జలాలను దిగువకు విడుదల చేయడంతో వరద నీరు లంకలను తాకింది. పలుచోట్ల కాజ్‌వేలు నీట మునిగాయి. అయినవిల్లి మండలం అయినవిల్లిలంకలో కాజ్‌వేపైకి వరద చేరింది. దీంతో అయినవిల్లి మండలంలో పల్లపులంక, వీరవల్లిపాలెం, అద్దంకివారి లంక, శానిపల్లిలంక, కె.పెదలంక గ్రామాల ప్రజల రాకపోకలకు అతరాయం ఏర్పడింది. వారు పడవలపై ప్రయాణాలు సాగిస్తున్నారు.

మామిడికుదురు మండలం పాశర్లపూడి కరకట్ట దిగువన అప్పనపల్లి కాజ్ వే వరద నీటిలో మునిగిపోయింది. కాజ్‌వే ఇప్పటికే ధ్వంసం కావడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పెదపట్నం, పెదపట్నం లంక గ్రామాల్లో పశుగ్రాసం నీట మునిగింది. బాల బాలాజీ దేవస్థానం స్నాన ఘట్టం పూర్తిగా నీట మునిగింది మూడు లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బి రహదారి జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. కొబ్బరి ఉత్పత్తుల రవాణాకు ఆటంకం ఏర్పడింది. పాశర్లపూడి శివారు శ్రీ రామపేట చుట్టూ వరద నీరు చేరింది. ఎంపిడిఒ భవాని, తహశీల్దార్, డిప్యూటీ ఎంపిడిఒ తదితరులు వరద ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించారు.

పి.గన్నవరం మండలంలో లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కనకాయలంక కాజ్‌వే పూర్తిగా నీట మునగడంతో ఆ ప్రాంత వాసులు నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఊడిమూడి లంక, బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడి లంక, పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్య లంక, మర్రిమూల, అనగార్లంక, పెదమలంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపో యాయి. తహవీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపిడిఒ జి.మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపిడిఒలు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు.

ముమ్మిడివరం మండలంలోని లంక ఆఫ్ ఠానేలంక, కూనలంక, గురజాపు లంక, కమిని, గేదేల్లంక, అన్నంపల్లి తదితర లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రధాన రహదారులపై వరదనీరు ఉధృంగా ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి వద్ద స్నాన ఘట్టాలు నీట మునిగాయి. మూడు నెలలుగా రేవులో ప్రయాణాలు నిలిచిపోయాయి. మళ్లీ గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో రేవులో పంటు, లాంచీల ప్రయాణాలు అప్పుడే ప్రారంభమయ్యే పరిస్థితి కనిపించట్లేదు. లంకల్లో కూరగాయలు, పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది.

అయినవిల్లిలంకలో పడవ ప్రయాణం

కోటిపల్లి రేవులో మునిగిన స్నానఘట్టం

ఆదిత్యలో ఉపాధ్యాయ విజయోత్సవ సభ

ప్రజాశక్తి-కాకినాడ

ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి ఫలితాల్లో ఆదిత్య అకాడమిలో శిక్షణ పొంది విజయం సాధించిన అభ్యర్థులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన నిర్వహించిచన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదిత్య శిక్షణా సంస్థలో డిఎస్‌సి-2025 శిక్షణ పొంది ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ విభాగం డైరెక్టర్ డి.ఎన్.గణేష్ ఫ్యాకల్టీ మెంబర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్రంలో మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆర్‌జెడి. నాగమణి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులనందరినీ, అందుకు సహకరించిన అధ్యాపక బందాన్ని ఘనంగా సత్కరించారు.

ఎంపికైన అభ్యర్థులను సన్మానిస్తున్న శేషారెడ్డి

రౌతులపూడిలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పర్యటన

ప్రజాశక్తి-రౌతులపూడి

కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి ఆదివారం మండల కేంద్రమైన రౌతులపూడిలో పర్యటించారు. తొలుత జనసేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో నియోజవర్గాలకు ఎంపీ నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నట్టు ఎంపీ శ్రీనివాస్ తెలిపారు. కత్తిపూడి నుండి రౌతులపూడి వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారి నిర్మాణ పనులకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జనసేన మండల స్థాయి కమిటీల నియామకం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ముఖ్య నాయకులు మేడిశెట్టి సూర్య కిరణ్, కరణం సుబ్రహ్మణ్యం, కత్తిపూడి బుచ్చి సీతమ్మ సత్రం బోర్డు మెంబర్ పక్కుర్తి సతీష్, జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిహారం పెంపుపై హర్షం

ప్రజాశక్తి-పిఠాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సమావేశంలో న్యాయవాదుల మరణానంతరం వారి వారసులకు అందచేసే పరిహారాన్ని పెంచుతూ తీసుకొన్న నిర్ణయంపై అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) జిల్లా అధ్యక్షులు మేడపాటి ధర్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రూ.6లక్షల నుంచి రూ.9 లక్షల మెడికల్ బెనిఫిట్స్‌ను రూ.లక్షా 50 వేల నుంచి, రూ.2 లక్షల 50 వేలకు పెంచుతూ తీర్మానించినందున బార్ కౌన్సిల్ చైర్మన్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను పెంచే విధంగా, ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహార బకాయిలను న్యాయవాదుల కుటుంబాలకు తక్షణం చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఎన్‌టిఆర్ ఆరోగ్య భరోసా స్కీమ్‌ను న్యాయవాదులకు కూడా వర్తింపు చేసే విధంగా, అర్హులైన జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్ వెంటనే చెల్లించేలా, న్యాయవాదులకు ఇళ్ళ స్థలాలు కేటాయించే విధంగా బార్ కౌన్సిల్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎంపీ ఉదయ శ్రీనివాస్

పూర్వ విద్యార్థుల సేవాభావం ఆదర్శనీయం

ప్రజాశక్తి-కాకినాడ

పూర్వ విద్యార్థుల సేవాభావం ఆదర్శనీయమని ఎంపి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం పలువురికి ఆయన సాయం అందించారు. 9 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, గుండె, ఫ్రాంకియాసిస్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ఇద్దరు మహిళలకు మూడు నెలలకు సరిపడా మందులు మొత్తం రూ.రెండు లక్షల విలువైన చెక్కులను ఎంపీ తంగెళ్ల ఉదయ్ అందించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని ఇటువంటి సేవాభావం కలిగిన పూర్వ విద్యార్థుల ట్రస్ట్ ఉండదని, వీరిని ఆదర్శంగా తీసుకుని అందరూ అవసరమైన వారికి సహాయం చేయాలని సూచించారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ట్రస్ట్ ఏర్పాటు చేసిన 8 ఏళ్లలో రూ.కోటీ 50 లక్షల విలువైన వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ట్రస్ట్ ట్రెజరర్ డివిఆర్. జగన్నాథరావు, సీమకుర్తి పాపారావు, వివి.రామ్‌చరణ్, రెడ్నం రమణమూర్తి, పి.అరుణ్ కుమార్, లలిత్ కుమార్ జైన్, బోడా ఆనంద్ కుమార్, వేదుల మధుసూదన్, ఆకుల సరళ పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆదివారం ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని అందుకోవాలని పలువురు నాయకులు పిలుపు ఇచ్చారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ భగత్ సింగ్ ఆశయాల సాధనకు విద్యార్థి లోకం కట్టుబడి ఉందని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భగత్ సింగ్ చిత్రపటానికి నాయకులు ఘన నివాళులర్పించారు. భారతమాత విముక్తి కోసం కేవలం 23 ఏళ్ల వయస్సులోనే నవ్వుతూ ఉరి కొయ్యను ముద్దాడిన భగత్ సింగ్, జ్వలించే నిప్పు కణికలా బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలిట సింహ స్వప్నంగా నిలిచారన్నారు. అసమానతలపై ఎగసిపడ్డ విప్లవ పతాకం అని కొనియాడారు. భగత్ సింగ్, ఆయన సహచరులు మత రాజకీయాలకు అతీతంగా సోషలిజం పట్ల సంపూర్ణ విశ్వాసం ప్రకటించారని, దోపిడీ లేని సమసమాజం కోసం యువకులను, రైతులను, కార్మికులను రాజకీయాల్లోకి సమీకరించారని గుర్తు చేశారు. నగర అధ్యక్షుడు వాసు మాట్లాడుతూ భగత్ సింగ్ జీవిత చరిత్ర, సిద్ధాంతాలను యువత తప్పక అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం భగత్ సింగ్ చిత్రపటానికి కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, కాకినాడ నగర కార్యదర్శి సాహిత్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భగత్ సింగ్ జీవిత చరిత్ర అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అంటే కేవలం అధికార మార్పిడి కాదని, ఒక మనిషిని ఇంకో మనిషి, ఒక జాతిని ఇంకో జాతి దోపిడీ చేసే వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడమేనని భగత్ సింగ్ చెప్పారన్నారు. నేడు నిరుద్యోగం, ధరలు, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, పాలక వర్గాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసం కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజిస్తున్నాయని ఆయన విమర్శించారు. సాహిత్ మాట్లాడుతూ, భగత్ సింగ్ కోరుకున్న సమసమాజం కోసం యువత పోరాడక మానదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కరుణ్, గమనివేలు, సహాయ కార్యదర్శులు సత్యం, మణికంఠ, నగర కమిటీ సభ్యులు తేజ, బ్లెస్సి పాల్గొన్నారు.

పిఠాపురం భగత్ సింగ్ ఆశయాలను భావజాలన్నీ ప్రజల్లోకి మరింత తీసుకెళ్ళాలని ఎస్‌ఎఫ్‌ఐ, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి ప్రజా సంఘాలు నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతిచిన్న వయసులోనే తన ప్రాణాలను అర్పించిన వ్యక్తి భగత్ సింగ్ అన్నారు. విప్లవ భావజాలాన్ని నింపుకుని పోరాటం చేసి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన భగత్ సింగ్ ఆశయాలను భావజాలాను ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై అందరూ ఐకమత్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సిద్దు, శ్రీకాంత్, లోవరాజు, సిఐటియు నాయకులు కె.చిన్న, విశ్వనాథం, యుటిఎఫ్ నాయకులు ప్రవీణ్, రజక వృత్తి సంఘం నాయకులు రాజు, నాగేశ్వరరావు, రాజేష్, సూర్యనారాయణ, స్టాలిన్, ఎలక్ట్రికల్ యూనియన్ వై.సత్య, శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వీరబాబు,గోవిందు, సూరిబాబు పాల్గొన్నారు.

పెద్దాపురం స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్, సామాజిక కవి గుర్రం జాషువా పోరాట పటిమను మనం ఆదర్శంగా తీసుకోవాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా నూలకుంట వీధిలోని విగ్రహం వద్ద, గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా యాసలపు సూర్యారావు భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం ఉరితాడు ఎక్కిన భగత్ సింగ్ త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. సామాజిక అసమానతలపై తన కలం ద్వారా నిరసన వ్యక్తం చేసిన కవి గుర్రం జాషువా రచనలు నేటికీ ప్రాసంగికమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, బంగారు రాజు, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గూనూరు రమణ, వడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, ఎస్.శ్రీనివాస్, పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, అనూష, అంజలి, జశ్విత, నాని, పవన్ కుమార్, మణికంఠ, బంగారం, సందీప్, హర్ష, చల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

శంఖవరం భగత్ సింగ్ స్ఫూర్తితో ఆదివాసీ హక్కులకై పోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. రాజశేఖర్ పిలుపునిచ్చారు. పెదమల్లాపురంలో ఆదివారం నిర్వహించిన సభలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, యువతను కూడగట్టి పోరాటాలు నిర్వహించి, నూనూగు మీసాల వయసులో ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్, వారి అనుచరుల త్యాగాలు ఎంతో స్ఫూర్తిదాయమని తెలిపారు. సావర్కర్ దేశ స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉంటానని బ్రిటిష్ వారికి క్షమాపణ లేఖ రాసాడని అటువంటి వ్యక్తిని దేశ నాయకుడిగా బిజెపి కీర్తిస్తోందని విమర్శించారు. దేశంలో ఆదివాసీ చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని, వనరులను కార్పొరేట్‌లకు దోచిపెడుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో జర్త ముసలయ్య, బాలరాజు, మాడెం లక్ష్మణ్, వరహాలు, నాగేశవరావు, ఉద్యోగ సంఘం నాయకులు గంటిమల్ల సత్తిబాబు, శ్రీనివాస్, దొంగబ్బాయి, తరుం నాగేశ్వరావు, లక్ష్మణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో భగత్ సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు



పెద్దాపురంలో..

పిఠాపురంలో..

శంఖవరంలో మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

కార్టూ'నిజం'

వినాయక్‌వర్మ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కిర్లంపూడి

ప్రముఖ బిల్డర్, వ్యాపారవేత్త సంపర సుధాకర శ్రీవినాయక్ వర్మ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రశంసించారు. ఆదివారం ఆయనను ఘనంగా సత్కరించారు. కిర్లంపూడికి చెందిన వినాయక్ వర్మ రాజమహేంద్రవరంలో స్థిరపడ్డారు. గ్రామానికి సేవ చేయాలన్న తపనతో చిల్లంగిలో ఉన్న గుబ్బాలమ్మ గుడికి రూ.12.లక్షల విలువ చేసే వెండి కిరీటం బహూకరించారు. చిల్లంగి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన సత్రాన్ని సుమారు రూ.40 లక్షల సొంత నిధులతో నిర్మించేందుకు నడుం కట్టారు. గ్రామంలో ఉన్న గౌరీ కళ్యాణ మండపానికి రూ.1,75,000 విలువైన ఎసిలు, అష్టలక్ష్మి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్టకు రూ.1 లక్షా 50 వేలు, మార్కెట్లో వేంచేసియున్న శ్రీ లక్ష్మి గణపతి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి రూ.1 లక్షా 50,000 విరాళం అందజేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి ఆలయానికి రూ.10 లక్షల 40 వేల విలువ చేసే 10 జతలు బంగారు సెతమానాలు, ముక్కు పుడకలు బహుకరించనున్నారు. వేలంక రామాలయంలో ఉన్న రామలక్ష్మణులు, సీత, ఆంజనేయ స్వామి వారి విగ్రహాలకు వెండి కిరీటాలు బహుకరించనున్నారు. దీంతో ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయన సేవలను కొనియాడుతూ స్థానిక ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం సంపర సుధాకర శ్రీ వినాయక్ వర్మను ఘనంగా సత్కరించారు. సుధాకర్ స్నేహితులు సంఘన వెంకటేశ్వరరావు, గొడే శేఖర్, దాడి పెదబుజ్జి, యల్లపు శివరామకష్ణ పాల్గొన్నారు.



వినాయక్ వర్మను సత్కరిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు

త్రిరత్న బౌద్ధ ధమ్మ సంఘం కమిటీ సభ్యులు

త్రిరత్న బౌద్ధ ధమ్మ సంఘం కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -కరప

త్రిరత్న బౌద్ధ ధమ్మ సొసైటీ వ్యవస్థాపకులు ధమ్మాచార్య పొలుగుమాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో కరప మండల త్రిరత్న బౌద్ధ ధమ్మ సంఘం కమిటీ ఏర్పాటు చేశారు. గిడ్ల వీర ప్రసాద్ బుద్ధవందనం చేయగా, అంబేద్కరీయులు సాదే వీరరాఘవులు బుద్ధుని ప్రతిమకు పుష్ప మాలలు వేసారు. కరపమండల త్రిరత్న బౌద్ధ ధమ్మ సంఘం ప్రెసిడెంట్‌గా మాతా అప్పారావు, వైస్ ప్రెసిడెంట్‌గా మారేళ్ల రామకృష్ణ, సెక్రటరీగా సాంబత్తుల రఘువర్మ, ట్రెజరర్ ఇజ్జిన లోవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిద్ధాబత్తుల అర్జున్, సభ్యులుగా డి.శ్రీనివాసరావు, కొప్పుల సూరిబాబు, జెల్లా శివకుమార్, వీడియ వెంకటేష్, అర్జున్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ అధికారి సాంబత్తుల వెంకట్రావు, రిటైర్డ్ పోలీసు అధికారి పేరేళ్ల చంద్రరావు, రచయిత సవిలే రాజేష్, జక్కల ప్రసాద్ బాబు, వినకోటి ధమ్మ ప్రసాద్, పినిపే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలేని అర్జిదారులు, వారి యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్ళరేవు విద్యుత్ సబ్ స్టేషన్, పల్లిపాలెం ఫీడర్ పరిధిలోని మెయింటినెన్స్ పని నిమిత్తం సోమవారం ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు పి.మల్లవరం, పత్తిగొంది, జార్జి పేట, ఎంఎల్‌కె.నగర్, నీలపల్లి, పోలేకుర్రు, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. చొల్లంగి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 09.00 గంటల నుంచి 12:00 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేస్తామని అన్నారు. దీనివల్ల చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం ఫీడర్, పటవల, కొత్తూరు, రామన్నపాలెం, మట్లపాలెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేరాలు ఘోరాలు

ఎంపిపి బొబ్బరాడపై కేసు నమోదు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు తనను మోసగించినట్లు హుస్సేన్‌పురానికి చెందిన ఉప్పల సీతారత్నం ఫిర్యాదు చేయడంతో ఆదివారం రాత్రి సత్తిబాబుపై సామర్లకోట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. బాధిత మహిళ స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఎంపిపి సత్తిబాబు తనను గత 15 ఏళ్ల క్రితం అన్నవరంలో పెళ్లి చేసుకున్నారని, ప్రస్తుతం వేరే అమ్మాయితో ఉంటూ తనను వదిలేసి మోసం చేసినట్లు తెలిపారు. పది రోజుల క్రితం ఈ విషయమే తాను సత్తిబాబును అడగగా తనను కొట్టినట్లు ఆమె తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కృష్ణ భగవాన్ తెలిపారు. ఈ విషయమై ఎంపిపి సత్తిబాబును వివరణ కోరగా తనను రాజకీయంగా దెబ్బతీయడానికి ఇటువంటి కేసులు పెట్టినట్లు పేర్కొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

సఖినేటిపల్లిలో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ తన సిబ్బందితో మూడుతూములు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.8150 నగదు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అంతర్వేదిపాలెం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.3,750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణం

ప్రజాశక్తి - రాజోలు

మండలంలోని ములికిపల్లిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కలగంపూడికి చెందిన కడలి అక్షయ్ (22) బుల్లెట్ మోటర్ సైకిల్‌తో లారీని ఢీ కొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అక్షయ్ చెన్నైలో బి.టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం రాత్రి చెన్నై నుంచి కలగంపూడి వచ్చిన అతను స్నేహితుడిని కలుస్తానని రాజోలు వైపు బుల్లెట్‌పై వచ్చాడు. ములికిపల్లి నలందా స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి కడలి మోహన్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాలధారుని ఢీకొన్న కారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం పుల్లలపాడు 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవాని మాలధారులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దోసలపాడుకు చెందిన పక్కృతి శివ, పక్కృతి శ్రీను, పక్కృతి శేషు, కోన గోవిందు భవానీ మాల వేసుకున్నారు. విజయవాడ కనకదుర్గ గుడికి పాదయాత్ర వెళ్లేందుకు ఈ నెల 24న బయలు దేరారు. ఆదివారం నల్ల జర్ల మండలం పుల్లలపాడుకు చేరుకున్నారు. ఈ సమయంలో విశాఖ వైపు నుంచి వస్తున్న కారు వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో పక్కృతి శివ(35), పక్కృతి శ్రీను(30) అక్కడికక్కడే మృతి చెందారు. పకతి శేషుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. కోన గోవిందు వీరికి దూరంగా ఉండటంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. వీరంతా వ్యవసాయ కూలీలు. శివకు భార్య దేవి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. పకతి శ్రీను అవివాహితుడు. పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఐదుగురు ప్రయాణిస్తున్న కారు వీరిని ఢీకొందని ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవాది ఏసురత్నం (74) పిఠాపురం నుండి మోటార్ సైకిల్‌పై ఉదయం 9:45 గంటలకు గొల్లప్రోలు చర్చికి వస్తుండగా గొల్లప్రోలు టోల్ ప్లాజా దాటిన తర్వాత వై.జంక్షన్ వద్ద పిఠాపురం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన కుమారుడు శ్రీధర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ సెంటర్‌లో ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలను ఆపి వారికి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, అనుమతి పత్రాలు, లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

10 నుంచి ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తితో జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధమైంది. జిల్లాలో ఖరీఫ్ సాగు తుది దశకు చేరుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గత అనుభవాల రీత్యా ఈ ఏడాది ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు జరిగేలా ప్రణాళికలు రూపొందించారు. అక్టోబరు 10 నుంచి ఒకే సారి 221 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభం కానుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు సందర్భంగా జెసి మేఘస్వరూప్ పలు విషయాలను వెల్లడించారు.

కొనుగోలు లక్ష్యం నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్‌లో 5.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశాం. ఇందులో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించాం. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టుకోవాలి. దళారుల మోసాలకు గురికాకుండా, రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపించుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం.

అందుబాటులో గోనె సంచులు

రైతుల సౌకర్యార్థం అవసరమైన గోనెసంచులు అందుబాటులో ఉంచాం. రవాణా వాహనాలు 221 కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,369, ఏ-గ్రేడ్‌కు రూ.2,389 చెల్లించనున్నాం. క్వింటాకు గోనెసంచుల వినియోగ ఛార్జీలు రూ.4.74, హమాలీ ఛార్జీలు రూ.22కూడా ప్రభుత్వమే భరిస్తుంది.

సులభతరంగా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సులభతరం చేయడానికి నూతన సాంకేతికతను వినియోగించుకోవటంతో పాటు కొనుగోలు

సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారు. 221 డిఇఒలు, 221 టిఎలు, 221 హెల్పర్లను తాత్కాలికంగా నియమించాం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైతులకు నచ్చిన మిల్లుల వరకు జిపిఎస్ పరికరాలు అమర్చిన వాహనాల ద్వారా తరలించనున్నాము.

కొనుగోలు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

జిల్లాలో ధాన్యం కొనుగోలు నేపథ్యంలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించాం. ఈ శిక్షణా కార్యక్రమాల్లో జిల్లాలోని ధాన్యం కొనుగోలు సిబ్బందికి ధాన్యం నాణ్యతా పరీక్ష విధానం, ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎంట్రీల విధానం, కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చాం. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాము.

మానవత ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాగల్లు

రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామని మానవత సేవా సంస్థ కన్వీనర్ జుజ్జువరపు ప్రసాద్ తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నెలాంతర సమావేశం ఆదివారం కలవలపల్లిలోని గీతామందిరం ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శాంతిరథం దాతలు పాతూరి శ్రీనివాసరావు హాజరయ్యారు. సొసైటీ ప్రెసిడెంట్ అబ్బూరి సీతయ్య, కొండేపాటి సుబ్బారావు, కొండేపాటి బాబూరావు, సుంకవల్లి వీరాంజ నేయులు, నిమ్మగడ్డ శ్రీధర్, గద్దే శ్రీనివాసరావు తదితర సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఒక రైతు బిడ్డ ప్రమాదవశాత్తూ కాలు ఫ్రాక్చర్ అయ్యింది. అతనికి వైద్యం సాయంగా రూ.10 వేల చెక్కును అందించారు. పలువురు మానవత కుటుంబ సభ్యత్వాలు-14, సింగిల్- 3 సభ్యత్వాలు స్వీకరించారు. కలవలపల్లిలో 56 సభ్యత్వాలు నమోదయ్యాయని ప్రసాద్ తెలిపారు.

అనుమతులు లేకుండా ఫ్లెక్సీల ఏర్పాటు

ప్రజాశక్తి - గోపాలపురం

అనుమతులు లేకుండా ఇష్టారాజ్యాంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్ అండ్ బి రోడ్లు, నేషనల్ హైవేలు, బైపాస్ రోడ్లు ప్రభుత్వ కార్యాలయాలు సమీపంలో, వస్త్ర వ్యాపార దుకాణాల వద్ద భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు పెడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక చెక్‌పోస్టు సెంటర్ వద్ద, నేషనల్ హైవే చౌరస్తా వద్ద భారీ స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. డివైడర్లు సైతం వదలకుండా అనేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. నెలలు తరబడి ఉంటున్నప్పటికీ వాటిని తొలగించడం లేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఇదే తరహాలో పుట్టినరోజులు, వివాహాలు, పండుగలకు శుభాకాంక్షలు తెలుపుతూ అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలకు చెంది ఫ్లెక్సీలు, అభిమాన హీరోల పుట్టినరోజులు, పండుగలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇలా నానా రకాల భారీ ఫ్లెక్సీలను పెడుతున్నారు. రోడ్లు, డివైడర్లు, సెంటర్లో, విద్యుత్ స్తంభాలకు సైతం ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.

బస్టాండ్‌ల వద్ద, రోడ్లకి రువైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ఎదురొచ్చిన వాహనాలు కనిపించడం లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలికి ఫెక్లీసు ఊడి రోడ్లమీద, ప్రయాణికుల మీద పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారుతున్నప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, నేషనల్ హైవే అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఫ్లెక్సీలు ఒక్కరోజు మించి ఉండకూడదు అన్న నిబంధనలు ఖాతారు చేయడం లేదు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేటప్పుడు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు, ఎన్ని రోజులు పెడుతున్నారు . ఏర్పాటు చేసే సైజులను ముందుగానే సంబంధిత పంచాయతీ అధికారులకు ఆ మేరకు చలాన నిర్ణయిస్తారు. ఈ విధంగా అధికారుల నుండి పర్మిషన్ తీసుకోవాలి. అధికారులు సూచనలు నిబంధనల ప్రకారం పర్మిషన్ పూర్తయిన తర్వాత వెంటనే ఫ్లెక్సీలను తొలగించాలి. లేకుంటే పంచాయతీ వారు వాటిని తొలగించేస్తారు. కనీసం అధికారులకు సమాచారం బోర్డులు కట్టేస్తున్నారు. దీంతో పంచాయతీకి రావలసిన ఆదాయంకు గండి పడుతుంది. వీటికి తోడు పలు గ్రామాల్లో ఫ్లెక్సీల వల్ల ఘర్షణలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ం.

అనుమతులు తప్పనిసరి : ఎంపిడిఒ

ఫ్లెక్సీలు ఏర్పాటుకు ముందుగానే పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపిడిఒ స్పష్టం చేశారు. పర్మిషన్ కాలవ్యవధి పూర్తికాగానే ఫ్లెక్సీలను తొలగించాలి. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీలకు సర్క్యులర్ జారీ చేశాం. తొలగించని వారిపై చర్యలు తీసుకుంటాం.

చింతలూరులో హతమైన కొండచిలువ

భారీ కొండచిలువ హతం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు పంచాయతీ పరిధి గౌడ కాలనీలో ఆదివారం భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. పచ్చగడ్డి కోసుకునే ఒక రైతు భారీ కొండచిలువను గుర్తించి స్థానికులకు సమాచారం అందించాడు. సుమారు 16 అడుగుల పొడవున ఉన్న ఈ కొండ చిలువను స్థానికులు హత మార్చారు.

రవీంద్రపురంలో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కొత్తపల్లి గ్రామపంచాయతీ రవీంద్రపురంలో ఆదివారం స్వచ్ఛ భారత్‌ను యువకులు నిర్వహించారు. ట్యూషన్ మాస్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో కొంతమంది విద్యార్థులు ఆ చుట్టుపక్కల ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చేశారు. వీటి పైన పలువురికి అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.. ప్రతి ఒక్కరూ వారి ఇంటి వద్ద అదే విధంగా చుట్టుపక్కల ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

లలితాదేవి ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక త్యాగరాయ వీధిలో కొలువై ఉన్న లలితాదేవి ఆలయంలో రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నరు. ఈ సందర్భంగా ఆదివారం నున్న రాజశేఖర్, వెంకట సూర్య రమ్యశ్రీ తేజస్వి దంపతులు, పెంటపాటి వెంకటేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఛాంబర్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎంఎల్ఎ బండారు

రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - రావులపాలెం

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా ఎంపికైన పోతంశెట్టి కనికిరెడ్డి, కార్యవర్గ సభ్యులు రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం స్థానిక కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో మాజీ చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి అధ్యక్షతన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. జ్యోతిప్రజ్వలన అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా పోతంశెట్టి కనికిరెడ్డి, కార్యవర్గ సభ్యులతో ఎంఎల్ఎ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాంబర్ అఫ్ కామర్స్ ఒక కమిటీకో, ఒక వ్యక్తికో, ఒక కులానికో, ఒక మతానికో సంబంధించింది కాదన్నారు. అందరు కలసికట్టుగా ఏర్పాటు చేసుకున్న సంఘమన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజలకు చేదోడు వాదోడుగా సభ్యులు ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, బిసి కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షుడు కెవి.సత్యనారాయణరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్, గుత్తుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు వేడుకలో మంత్రి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుత్తుల సాయి మనుమరాలు అక్షజ్ఞ పుట్టినరోజు వేడుకలో మంత్రి సుభాష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఆదివారం మండలంలోని కొమానపల్లి గ్రామంలోని ప్రయివేట్ ఫంక్షన్ హాలులో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, మాజీ ఎంపిపిలు పెన్మత్స చిట్టిరాజు, దాసరి జగదీశ్వరి, నాయకులు పెన్మత్స జగ్గప్పరాజు, నాగిడి నాగేశ్వరరావు, తాడి నరసింహారావు, సిఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ జ్వాలాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి గ్రామాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎస్‌సి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని టిడిపి ఎస్‌సి సెల్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అనాతవరంలో మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మిమ్మితి చిరంజీవి ఇంటి వద్ద సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీకి చెందిన ఎస్‌సి నాయకులు మాట్లాడుతూ చదువులో ముందుండే ఎస్‌సి యువతను గుర్తించి ప్రోత్సాహించేలా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయాలనీ, ఒఎన్‌జిసి, కెయిర్న్ ఎనర్జీ, గెయిల్ అథారిటీ ఆఫ్ ఇండియా, రిలయన్స్ సంస్థల్లో ఎస్‌సి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పూర్తి చేసిన వారికి ప్లేస్‌మెంట్ కల్పించాలని, అలాగే మారుముల ఎస్‌సి గ్రామాలకి సైతం రోడ్ల నిర్మాణానికి నిధులను విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో పదవులు పొందిన ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్‌ను దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గోపి, బొంతు నాగరాజు, దాసరి సాయిబాబా, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, పెయ్యిల పరశురాముడు, కుంచే శ్రీను, బి.కల్యాణ్, ఇసుక పట్ల ఈశ్వర్, కాశి లాజర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బైబిల్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని బస్టాండ్ వద్ద గల బేతేలు ఆరాధన మందిరంలో విరామ బైబిల్ పాఠశాల తరగతులు నిర్వహణకు ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 29వ తేదీ సోమవారం నుంచి 3 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. సండే స్కూల్ చిన్నారులకు బైబిల్ పాఠాలు, క్రాఫ్ట్, గేమ్స్, యాక్షన్ సాంగ్స్, పప్పెట్ షో వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

సిసి కెమెరాలతో నిఘా

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో పోలవరం కాలువ గట్టు, అక్రమ పశువధ, అక్రమ గ్రావెల్ తవ్వకాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై సిసి కెమెరాలతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల వద్ద, జొన్నాడ ఏటిగట్టు వద్ద గల జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం...రాజమహేంద్రవరం రూరల్ మోరంపూడికి చెందిన పసుపులేటి వేణుగోపాల రావు(47) శనివారం బైక్‌పై వాడపల్లి వ్యాపారం నిమిత్తం వెళ్లి, పని ముగించుకుని ఆదివారం వేకువజామున తిరిగి స్వగ్రామానికి వెళ్తూ చొప్పెల్ల వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించే లోపు మృతి చెందాడు. అలాగే కడియం మండలంలోని పొట్టిలంకకు చెందిన వెలగపు సుజాత(45) తన భర్త సూరిబాబు బైక్‌పై వెనక కూర్చొని ప్రయాణిస్తుండగా జొన్నాడ వద్ద బైక్ పైనుంచి రోడ్డుమీద పడిపోయింది. వెనుకనే వచ్చిన ఆర్‌టిసి బస్సు ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యింది. అనంతరం సుజాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు అందజేశారు. రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిపి రాత పరీక్ష ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జెఎన్‌టియుకెలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాత పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ సూచించారు. ఆదివారం పరీక్షా కేంద్రాలను ఎస్‌పి బిందుమాధవ్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవరాజ్ మనీష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అక్టోబర్ 5న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల రాత పరీక్ష నేపథ్యంలో విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్, ఎపిఇఎపిసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వివి సుబ్బారావును ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇసిఇ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న పరీక్షా గదులను పరిశీలించారు. పరీక్షా సమయంలో భద్రతా ఏర్పాట్లు కఠినంగా ఉండాలన్నారు. సిసి కెమెరా వ్యవస్థను సమగ్రంగా అమలు చేయాలని, ఇన్విజిలేటర్లు పూర్తిగా శిక్షణ పొందిన వారే ఉండాలన్నారు. పరీక్ష సమయం ముందు, తర్వాత యూనివర్సిటీ ప్రాంగణంలో అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా చూడాలన్నారు. ఆరంభ సమయానికి ముందే అభ్యర్థులు క్రమబద్ధంగా ప్రవేశించే విధంగా గేట్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎటువంటి కాపీయింగ్ లేదా మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డిఐజి అశోక్ కుమార్

అధ్వానంగా సర్వీస్ రోడ్డు డ్రెయినేజీ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట ఫ్లయ్ ఓవర్ ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. గత నాలుగేళ్ల నుంచి ఈ డ్రైనేజీని హైవే సిబ్బంది శుభ్రపరిచిన పాపాన పోలేదు. డ్రైనేజీ శుభ్రపరచకపోవడంతో మురుగునీరు వెళ్లడం లేదు. మూడు నెలల నుంచి డ్రైనేజీ కూరుకుపోవడంతో నీరు పోయే దారి లేక అప్రోచ్ రోడ్లపై మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురి కావడమే కాక బైకుల పైనుంచి జారిపడి గాయాల పాలవుతున్నారు. అంతేకాక హైవే పక్కనే ఉన్న షాపుల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంతలా మురుగునీరు ప్రవహిస్తూ వాహనదారులు, దుకాణదారులు ఇబ్బందులు హైవే అధికారులు, సిబ్బంది చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా హైవే ఉన్నతాధికారులు స్పందించి మురుగునీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పార్సిల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్

పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పార్సిల్ కార్యాలయాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆదివారం తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అనుమానిత, నిషేధిత పదార్థాలు రవాణా అవుతున్నట్లు గుర్తిస్తే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆ యాజమాన్యానికి సూచించారు. దీపావళిని పురస్కరించుకుని పేలుడు సామగ్రి ఎగుమతి, దిగుమతులను చేస్తుంటారని వాటిని అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నామని సిఐ తెలిపారు.

యాత్రికులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం వద్ద నడిచి వెళ్ళే యాత్రికులకు అల్పాహారం, మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. హైవే మీదుగా విజయవాడ నడిచి వెళ్లేవారికి గ్రామానికి చెందిన కరణం వీరబాబు కుటుంబికులు, తదితరులు ప్రతి ఏడాదీ అల్పాహారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా 6 రోజులుగా పంపిణీ చేస్తున్నారు. రాత్రి సమయంలో నిద్రించేందుకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఇలా విజయదశమి వరకూ బాటసారులకు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. రామవరం తాగునీటి చెరువుగట్టు వద్ద ఏర్పాటు చేసిన విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. అన్నదానంలో అధిక సంఖ్యలో యాత్రికులు భోజనాలు చేశారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం ఆర్‌బి.పట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం మన్యం ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి దొరబాబు, కల్తూరు శ్రీను, సానిపిని సురేష్, నల్లల శ్రీను, నూనె రామారావు తదితరులు హాజరయ్యారు. ఈ శిబిరంలో డాక్టర్ రజని సహా ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు. గ్రామానికి చెందిన సుమారు 300 మంది వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రజిని

దొంగతనాలను అరికట్టడమే లక్ష్యం

ప్రజాశక్తి - జగ్గంపేట

దసరా సందర్భంగా ప్రయాణాల్లో ఎక్కువగా దొంగతనాలు జరుగుతాయని, వాటిని అరికట్టడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జగ్గంపేట ఆర్‌టిసి కాంప్లెక్స్, జెవిఆర్ సెంటర్, అన్ని ఆటో స్టాండ్స్‌కు, దుకాణదారులకు పోలీస్ మొబైల్ నెంబర్ల 9440796529, 9948614999 విజిటింగ్ కార్డులు అందజేశారు. బస్సులు ఆటోల్లో బ్యాగ్ దొంగతనాలు, పిక్‌పాకెటింగ్ ఎక్కువగా జరుగుతాయన్నారు. అటువంటివి సర్కిల్ పరిధిలో ఎక్కడైనా జరిగినా అనుమానితులు ఉన్న వెంటనే తెలియజేయాలని షాప్ యజమానులను, ఆటో వారిని, ఆర్‌టిసి కాంప్లెక్స్ సిబ్బందిని అలర్ట్ చేసినట్టు తెలిపారు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 12/2023, M.P. 89/2018
O.P. 29/2011

Between:

M/s. శ్రీ ధనలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, కాకినాడ, ప్రొప్రయిటర్ బై ఇట్స్ జనరల్ మేనేజర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీ పసుమర్తి వీర పైడన్న చెట్టి, S/o. అప్పారావు (లేటు) ...DHR

మరియు

శ్రీ తటవర్తి అయ్యన్నదొర & 10 మంది ఇతరులు ...JDRs

To:

1. తటవర్తి అయ్యన్నదొర, S/o. లేటు దేవి వెంకన్న దొర, 51 సం॥లు, డో.నెం. 2-6-3, రైల్వేస్టేషన్ రోడ్డు, అన్నవరం, శంఖవరం మండలం, ప్రస్తుతం కాకినాడ జిల్లా. -1వ JDR
2. తటవర్తి నరశింహ వరమాలు, S/o. లేటు దేవి వెంకన్న దొర, 39 సం॥లు, డో.నెం. 2-6-3, రైల్వేస్టేషన్ రోడ్డు, అన్నవరం, శంఖవరం మండలం, ప్రస్తుతం కాకినాడ జిల్లా. -9వ JDR
3. తటవర్తి చిట్టిబాబు, S/o. లేటు దేవి వెంకన్న దొర, 39 సం॥లు, డో.నెం. 2-6-3, రైల్వేస్టేషన్ రోడ్డు, అన్నవరం, శంఖవరం మండలం, ప్రస్తుతం కాకినాడ జిల్లా. -10వ JDR

పై నెంబరు E.P. 12/2023 లో JDR లు అయిన మీ ముగ్గురికి అనగా 1వ JDR, 9వ JDR, 10వ JDR లకు DHR గారు ఎన్నిమార్లు నోటీసు బేటాను కట్టినను మీ ముగ్గురు అందుకోకుండా తిప్పి పంపించివేయు చున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారంగా ఈ ప్రకటన మూలముగా మీ ముగ్గురికి తెలియజేయునది ఏమనగా, **ది. 10-10-2025వ తేదీన** మీరు ముగ్గురు న్యాయవాది కృతముగా గాని, స్వయముగా గాని, పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 నిమిషములకు** హాజరుగా ఉండవలయును. లేని యెడల మీ ముగ్గురిని ఎక్స్‌పార్టీ చేసి, మీ పరోక్షమున దావాను తీర్మానించెదరని తెలియజేయడమైనది.

కొత్తకోట సత్య సూర్యనారాయణ
అడ్వకేట్, పిఠాపురం
సెల్: 7013500599, 9059929277